చిన్న కథ

# నేను గొప్ప తాతను!

-లయన్.కె.బి.కృష్ణ

అమెరికాలో స్థిరపడిన నా మనవడు, అల్లుడు వచ్చారు. అల్లుడు వస్తుంటే అమ్మ తిరిగిన ప్రాంతాలు చూస్తానని మనవడూ ఆయన కూడా వచ్చేశాడు. మా అమ్మాయి, మనవరాలు వీలుకాక రాలేదు. మా అమ్మాయి తను తిరుగాడిన ఊరు గురించి వివరంగా చెప్పి, అన్నీ చూసి రమ్మని చెప్పిందట కొడుక్కి.

సెవెన్త్ స్టాండర్ చదువుతున్న నా మనవడు సందీప్ నాలుగడుగుల ఎత్తులో, ఎర్రగా, కాంతితో మెరిసిపోతూ, బొమ్మలా వుంటాడు.

గలగలా పారే గోదావరి నీళ్ళతో పంట కాలువలూ, కాలువ గట్లపై క్రమశిక్షణతో నిలబడిన సైనికుల్లా కొబ్బరి చెట్లూ, ప్రవహించే నీటి మీదుగా వీచే చల్లని గాలి, చుట్టూ ఆకుపచ్చని పంట చేలు, వాటి మీదుగా వచ్చే గాలితో పాటు ప్రకృతి సుగంధం యొక్క పరిమళం, వర్ణించనలవిగాని ఈ దృశ్యం ప్రత్యేకంగా గోదావరి జిల్లా వారికే చెందిన సౌభాగ్యం.

పంచాయితీ కార్యాలయం దగ్గర మర్రి చెట్టునీడలో పంచాయితీలు జరిగే పెద్ద అరుగు, మా అమ్మాయి దినపత్రికలు చదివే పంచాయితీ లైబ్రరీ, రోజు సాయంత్రం రేడియోలో వార్తలు వినే పంచాయితీ పార్క్. కార్తీక స్నానాలు చేసే పంట కాలువల రేవు. దారిలో రామాలయం చూపించి ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి నాడు సీతారామ కల్యాణం జరిగేటప్పుడు మా అమ్మాయి మిగతా అమ్మాయిలతో కలిసి చేసిన అల్లరి వంటి అనేక విషయాలు చెబుతూ అన్నీ చూపించాను. ఇవన్నీ చూసేటప్పుడు వాడికళ్ళల్లో వింతకాంతి చూశాను.

ఉదయం తొమ్మిది కావస్తూంది. భుజాలకు తమ తమ వయసులకు మించిన భారం వేసుకుని కొంతమంది విద్యార్థినీ విద్యార్థులు, కొంత మంది నడిచి వెళ్తూంటే, మరి కొంత మంది సైకిళ్ళ పై స్కూలుకు వెళ్తున్నారు.

''తాతగారూ. మన ఊళ్ళో స్కూలుకేనా వెళ్ళేది వీళ్ళు. ఎంత దూరం నుండి వస్తున్నారు అని అడిగాడు సందీప్.

''చుట్టు పక్కల నాలుగైదు కిలోమీటర్ల నుండి రోజు నడిచి వస్తారురా. ఎప్పుడో ఉదయమే లేచి వచ్చేస్తారు-'' అన్నానేను. ''గ్రాండ్ పా'' అని పిలవకుండా ''తాతగారూ'' అని పిలవడంతో నా కళ్ళు పులకరించాయి.

''మా అమ్మ చదువుకున్న స్కూలేనా అది. మనం స్కూలుకు వెళ్దాం పదండి'' అన్నాడు వాడు. 'అమ్మ' అనే అమృతపాయమైన పదాన్ని 'మమ్మీ'లా బంధించకుండా 'అమ్మ' అన్నందుకు నా గుండెలు పొంగేయి. ''అవును నా మనవడు వీడు'' అనుకొన్నాను సంబరంతో.

ఇంతలో స్కూలుకి చేరుకున్నాం.

తిన్నగా హెడ్‌మేస్టార్‌గారి గదికి వెళ్ళాం.

''వీడు అమెరికాలో ఉన్న మా అమ్మాయి పూర్ణిమ కొడుకు మాస్టారూ. తన తల్లి చదువుకున్న స్కూలు చూస్తానని నాకూడా వచ్చాడు. అక్కడ సెవెన్త్ స్టాండర్డ్ చదువుతున్నాడు'' అన్నాను.

''నమస్కారం మేస్టారూ. మా అమ్మ నన్ను తను చదువుకున్న స్కూలు చూడమంది. మీరు మా అమ్మ చదువుకునేటప్పుడు వున్నారా-అంటూ రెండు చేతులూ జోడించి వినయంగా అడుగుతున్న అతన్ని నిశితంగా పరిశీలిస్తూ, తన బట్టతలను సవరించుకుంటూ-

''అవును బాబూ మీ అమ్మ బాగా చదువు కునేదనీ, ఎంతో తెలివైనదనీ, అయినా నిరాడంబరంగా వుండేదనీ అందరూ చెబుతుంటారు'' అంటూ ఆయన చెబుతుంటే ఇంటర్ బెల్ మోగింది.

ఆడపిల్లలు దుబ్బుల చాటుకు వెళ్తుంటే, మగపిల్లలు ఎక్కడ పడితే అక్కడ నిలబడి కాలకృత్యాలు తీర్చుకోవడం, ఆ తరువాత ఒక సిమెంట్ తొట్టె దగ్గర అందరూ ఎగబడి ఒకే సారి నీళ్ళు త్రాగడం చూస్తున్నాడు సందీప్.

''తాతగారూ వీళ్ళకు బాత్ రూమ్స్ లేవా. మంచినీళ్ళు తాగడానికి ఏర్పాట్లు లేవా? ''అని నెమ్మదిగా నాతో చెబుతున్న సందీప్ మాటలు విని హెడ్‌మాస్టర్‌గారు ''బాబూ ప్రభుత్వానికి వ్రాశాము. త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు'' అన్నారు.

కొంచెం సేపు కూర్చున్నాక నా మనవడు ''పదండి తాతగారూ వెళ్దాం'' అన్నాడు. మేస్టారికి చెప్పి వచ్చేశాము.

కొన్ని రోజుల తరువాత మా మనవడు సందీప్ అమెరికా వెళ్ళి పోయాడు తండ్రితో. కాని వాడి మాటలు చేతలు నా మనోఫలకం నుండి ఇంకా చెదిరిపోలేదు. అసలు కన్నా వడ్డీ ఎక్కువంటారు గదా, వాడిరూపంలో, ప్రవర్తనలో క్షణం క్షణం నా కూతురు కనిపించడమే అసలు కారణం.

నెలరోజులు దాటింది సందీప్ వెళ్ళి-

ఒక రోజున కొరియర్‌లో కవరు వచ్చింది. అందులో ఒక చెక్కు, సందీప్ చేతిరాతలో ఒక ఉత్తరం.

''తాతగారికి నమస్కారములతో వ్రాసేది.

మా అమ్మా, నాన్నగారు నాకు తరచూ ఇచ్చిన పాకెట్ మనీ దాచుకోవడం నాకు అలవాటు. అలాగే మా స్కూలులో ధనవంతులైన విద్యార్థినీ విద్యార్థుల వద్ద నేను కొంత డబ్బు సేకరించాను. నేను పంపించే ఈ డబ్బుతో రెండు ఆటోలు కొనండి, ఆడ పిల్లలకు, మగ పిల్లలకు విడివిడిగా బాత్ రూమ్స్ కట్టించండి. ఓవర్ హేడ్ ట్యాంక్ కట్టించి, ఫిల్టర్లు ఏర్పాటు చేసి, పిల్లలకు తాగడానికి క్లోరినేటెడ్ వాటర్ ఏర్పాటు చేయించండి. నేను ఇక నుండి ప్రతి సంవత్సరం ఆటోల ఆయిల్స్ తదితర అవసరాల కోసం, డబ్బు పంపిస్తూనే వుంటాను.

మా అమ్మ చదువుకున్న స్కూలు దర్జాగా వుండాలి. ఆస్కూలులో పిల్లలందరూ సంతోషంగా వుండాలి ఈసారి నేను వచ్చినపుడు ఇంకొన్ని ఏర్పాట్లు చేస్తాను. ఈసారి అమ్మా, నాన్న గార్లను సంప్రదించాలి. మీతో చెప్పకుండా ఇవన్నీ చేసినందుకు మన్నించండి తాతగారూ-'' సందీప్.

ఉత్తరం చదవడం పూర్తి అయ్యాక ఆనందాతిరేకంతో నా కనుకొలనుల్లో నిండిన ఆనంద భాష్పాల పొదలలో నుండి నా చిన్నారి చిట్టి మనవడి సుందర రూపం అంతెత్తున గోచరిస్తోంది.

-''నేను గొప్ప తాతను'' అనుకున్నాను. నా భుజాలు పైకి లేచాయి.

సందీప్ ఉత్తరం, చెక్కు తీసుకుని, సందీప్ చెప్పిన ఏర్పాట్లు చేయడానికి స్కూలుకు బయలుదేరాను.

దేశం నాకేమి ఇచ్చింది? దేశం కోసం నేనేం చేయగలను? ఒక వేళ నేను ఏదైనా చేసినా, కోట్లాది ప్రజలలో ఎంతమందికి ప్రయోజనం చేకూరు తుంది? చాల్లెండి. మనం చేయడం ఎందుకు? ప్రభుత్వాలు ఉన్నవి అందుకే కదా అనుకుంటూ వుంటారు. కాని ఇది ఎంత వరకు నిజం? ఎవరి వంతు వారు ఏదో ఒకటి చేస్తే కోట్లాది మందిలో కనీసం కొంత మందికైనా మనం మేలు చేసిన వారం అవుతాము కదా. మా సందీప్ మార్గదర్శకు డైనందుకు పొంగిపోతోంది నా మనస్సు.

*

